నత్తనడకన 'డబుల్' నిర్మాణం

- నాలుగేళ్లుగా కొనసాగుతున్న పనులు
- ఎదురుచూస్తున్న 616 మంది డబుల్‌బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులు
- భూపోరాట కేంద్రాల ద్వారా ఎండలో నిరసనలు


డబుల్‌బెడ్రూం నిర్మాణ ప్రాంతంలో నిరుపేదల గుడారాలు

జ్యోతినగర్: ప్రభుత్వం పేదలకు సొంత ఇంటిని నిర్మించి ఇస్తామని ఇచ్చిన వాగ్దానం కలగానే మిగిలిపోతోంది. డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకానికి పట్టిన గ్రహణం వీడటం లేదు. నాలుగేళ్ల క్రితం రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ జంగాలపల్లెతో పాటు ఫైవింక్లయిన్ ప్రాంతంలో ప్రారంభమైన గృహ సముదాయాల నిర్మాణం నిర్లక్ష్యానికి గురవుతోంది. నాలుగేళ్ల క్రితం మొదలుపెట్టిన గృహ నిర్మాణాలు ఒకడుగు ముందుకు.. నాలుగడుగులు వెనక్కి అన్న చందంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికీ ఒక్క ఇంటి పని కూడా పూర్తికాలేదు. నిరుపేదలు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2019లో ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించి జంగాలపల్లెలో 56 బ్లాకులుగా ఒక్కో బ్లాకులో 12 నివాసాలుగా 672 ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు.

లబ్ధిదారుల్లో ఆందోళన..

ఇటీవల డబుల్‌బెడ్రూం ఇళ్లకు డ్రా తీసి లబ్ధిదారులను ఎంపిక చేశారు. కానీ కొన్ని కారణాలతో లబ్ధిదారుల జాబితాను ప్రకటించి నిలిపివేశారు. 7వేల పైచిలుకు దరఖాస్తులు రాగా వాటిలో 2340 మంది అర్హత పొందారు. డ్రా తీయగా 616 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. అర్హులైన వారు తమకు ఇళ్లు ఎప్పుడు వస్తుందో లేదో అని ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వ స్థలాల్లో గుడారాలు..

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ ఇవ్వకపోవడంతో పేదలు ప్రభుత్వ స్థలాల్లో గుడారాలు వేసుకుంటున్నారు. వేసవి ఎండలకు తమకు గూడు కావాలని నిరుపేదలు పొద్దంతా కూర్చుని పడిగాపులు కాస్తున్నారు. గుడిసెలు, అద్దె ఇళ్లలో నివాసం ఉండే పేదలు అధికారులకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్నారు. పేదల సంఖ్య అధికంగా కనిపిస్తుండగా ఎందరికి ఇళ్లు దక్కుతాయో.. ప్రభుత్వం ప్రకటించినట్టు గృహలక్ష్మి పథకానికి ఎందరు అర్హులవుతారో అని పేదలు ఎదురుచూస్తున్నారు.

న్యాయం జరగడం లేదు



మేము నిరుపేదలం. ప్రభుత్వం మాకు ఇంటి స్థలం కేటాయించాలి. మాకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ మాకు న్యాయం జరగడం లేదు. ప్రభుత్వ అధికారులు మా పరిస్థితిని పరిశీలించి ప్రభుత్వ భూమిని కేటాయించి న్యాయం చేయాలి.

– విజయ, రమేశ్‌నగర్, గోదావరిఖని

రెండు నెలలుగా నిరసన



జంగాలపల్లె, ఇందిరమ్మ కాలనీ, న్యూపీకేరామయ్యకాలనీతో పాటు పలు ప్రాంతాల్లో సీపీఎం ఆధ్వర్యంలో భూపోరాట కేంద్రాలు ఏర్పాటు చేశాం. అర్హులైన పేదల దరఖాస్తులను తహసీల్దార్‌కు అందించాం. కానీ మాకు సరైన న్యాయం జరగడం లేదు.

– ఫైముద, సీపీఎం నాయకురాలు

పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి



మేము రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్‌లో ఉంటున్నాం. మేడిపల్లి ఓపెన్‌కాస్టుకు సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న డబుల్‌బెడ్రూం ఇళ్లు స్థానికంగా ఉన్న నిరుపేదలకు కేటాయించాలి. ప్రభుత్వ భూమిని సర్వే చేసి అర్హులైన పేదలకు ప్లాట్లుగా చేసి పట్టాలు ఇవ్వాలి.

– బరిగెల వెంకటేశ్, జంగాలపల్లె

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు



ప్రభుత్వ స్థలాలను ఇష్టానుసారంగా ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటాం. పేదలు తమకు ఇళ్లు, ఇంటి స్థలం కావాల్సిన వారు నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. అర్హత ఉన్నవారికి ఇంటి స్థలాలను కేటాయిస్తాం. ధ్రువీకరణ పత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలి.

– జాహెద్‌పాషా, తహసీల్దార్, రామగుండం

క్లుప్తంగా

వైభవంగా బీరన్న నాగవెల్లి పట్నం


మొక్కులు చెల్లిస్తున్న బీజేపీ నాయకులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్‌లో కుర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీరన్న పట్నాల ఉత్సవాల్లో భాగంగా బుధవారం మహంకాళి బీరప్ప–కమరావతి నాగవెల్లి పట్నం వైభవంగా నిర్వహించారు. బీర్ల పూజారులు బీరన్న కథను ఆలపించి భక్తులకు వినిపించారు. బీజేపీ నాయకులు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి, ఏగోలపు సదయ్యగౌడ్ హాజరయ్యారు. కురుమ సంఘం అధ్యక్షుడు అప్పాల పోచాలు, పెద్దకుర్మ కొమురయ్య, జారతగొండ రాయుడు, ఎల్కపల్లి ఓదెలు, అప్పాల రాజయ్య, ఐలయ్య, రవి, పెద్ది సమ్మయ్య, బండారి సింగయ్య పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శ్రీకారం


మాట్లాడుతున్న కమిషనర్ రాజశేఖర్

సుల్తానాబాద్: డ్రైనేజీ పనులకు మున్సిపల్ పాలకవర్గం శ్రీకారం చుట్టింది. పట్టణంలోని చెరువు కట్ట నుంచి పాత జెండా హనుమాన్ ఆలయం వరకు, రోడ్డు బుధవారం విస్తరణ పనులను స్థానిక ఇంటి యజమాన్యంతో మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, కమిషనర్ రాజశేఖర్ ప్రారంభించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి నిధులు మంజూరన్నారు. రూ.1.11కోట్ల వ్యయంతో రోడ్డు డ్రైనేజీ నిర్మాణం పనుల కోసం టెండర్ పూర్తయిందని, త్వరలో పనులు చేపడతామని తెలిపారు. కౌన్సిలర్లు పసిడ్ల మమత, సంపత్ గాజుల లక్ష్మి, రాయమల్లు, నిశాంత్, రఫీక్, బిరుదు సమత, కృష్ణ, పారుపల్లి జ్ఞానేశ్వరి, గుణపతి, కూకట్ల గోపి, లక్ష్మి, అరుణ బాబురావు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు కనీస వేతనం చెల్లించాలి


మాట్లాడుతున్న కృష్ణ

జ్యోతినగర్: ట్రాక్టర్ డ్రైవర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాక్టర్ డ్రైవర్లు సమ్మెలోకి వెళ్లారని, యజమానులు వెంటనే చర్చలకు ఆహ్వానించి కొత్త వేతన ఒప్పందం చేసుకోవాలని సూచించారు. మార్చిలో డిమాండ్ నోటీస్ ఇచ్చామని ఎలాంటి స్పందన రాకపోవడంతో సమ్మె నోటీసు ఇచ్చినట్లు చెప్పారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేశ్, చిలుక శంకర్, బుచ్చయ్య, కొమురయ్య, మురళి, నాయకులు శ్రీనివాస్, తిరుపతి, స్వామి, సురేశ్ పాల్గొన్నారు.

ఐకేపీ వీవోఏ సిబ్బందికి సంఘీభావం


మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: తమ డిమాండ్ల సాధనకు కొన్నిరోజులుగా సమ్మె చేస్తున్న ఐకేపీ వీవోఏలకు మంథని కాంగ్రెస్ నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. నిరవధిక దీక్షా శిబిరాన్ని వారు సందర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, నాయకులు నూకల బానయ్య, మంథని సత్యం, రావికంటి సతీశ్, ఆర్ల నాగరాజు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కాల్వశ్రీరాంపూర్: మడంలంలోని మీర్జంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో బుధవారం మహాలక్ష్మి, భూలక్ష్మి, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ ఉపాధ్యక్షుడు విజయరమణారావు, సర్పంచ్ నాగార్జున్‌రావు, బీజేపీ నాయకులు ఏగోళపు సదయ్యగౌడ్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ


రామకృష్ణ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా రామకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఎస్సైగా పనిచేసిన మహేందర్ పెద్దపల్లికి బదిలీ అయ్యారు.

ముగిసిన సీఎం కప్ మండలస్థాయి పోటీలు


మంథని: విజేతలతో ప్రజాప్రతినిధులు, అధికారులు


జ్యోతినగర్: క్రీడాకారులతో ఇన్‌చార్జి కమిషనర్


సుల్తానాబాద్: విజేతలతో ఎంపీపీ బాలాజీరావు

మంథని/జ్యోతినగర్/పాలకుర్తి/ఎలిగేడు/జూలపల్లి/సుల్తానాబాద్/ధర్మారం/ఓదెల/రామగుండం: జిల్లావ్యాప్తంగా ఆయా మండలాల్లో మూడురోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు బుధవారంతో ముగిశాయి. గెలుపొందిన క్రీడాకారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు మాట్లాడుతూ వాలీబాల్, కబడ్డీ, ఖోఖో తదితర పోటీల్లో మండల స్థాయిలో విజేతలైన క్రీడాకారులు ఇదే ఉత్సాహంతో జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయి పోటీల్లో విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థానాన్ని పొందవచ్చని అన్నారు.

మొదటి కేటగిరీ వేతనాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న అశోక్

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మొదటి కేటగిరీ వేతనాలు అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ అన్నారు. ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీ 7వ జోన్ కాంట్రాక్ట్ కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 19న కలకత్తాలో 11వ వేతన ఒప్పందంపై చర్చలు నిర్వహిస్తున్న సందర్భంగా జాతీయ సంఘాల నాయకులు కాంట్రాక్ట్ కార్మికుల మొదటి కేటగిరీ వేతన ఒప్పందంపై చర్చించాలని కోరారు. నాయకులు రమేశ్, సులోచన, నగేష్, శారద, పద్మ, కమల, రాజేశం, మధునయ్య, సాగర్ ప్రకాష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

30రోజులపాటు మహా సంపర్క అభియాన్

పెద్దపల్లిరూరల్: పీఎం నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో గ్రామస్థాయి నుంచి అమలు చేసిన ప్రజాసంక్షేమ పథకాలను వివరించేందుకు 30 నుంచి మే 30 వరకు మహా సంపర్క అభియాన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ తెలిపారు. ప్రతి పల్లెలోని బూత్‌స్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని నిర్ణయించామన్నారు. ఇందుకోసం ఆరుగురు సభ్యులతో కమిటీని ఖరారు చేశామని, వారు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా చందుపట్ల సునీల్‌రెడ్డి, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మణ్‌యాదవ్, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బి.సంపత్‌ను నియమించినట్లు తెలిపారు. ధర్మారం మండల ఇన్‌చార్జిగా ప్రదీప్‌కుమార్‌గౌడ్, జిల్లా మీడియా ఇన్‌చార్జిగా తంగెడ రాజేశ్వర్‌రావు, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా ముంజ రాజేంద్రప్రసాద్‌ను నియమించినట్లు తెలిపారు.

విజేతలకు బహుమతి ప్రదానం

రామగుండం: మదర్స్‌డే దినోత్సవాన్ని సందర్భంగా క్రియేటివ్ ట్యుటోరియల్స్‌లో ప్రయివేట్ టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఇటీవల వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కాగా బుధవారం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఇందులో ప్రథమ బహుమతి శిజ(లిటిల్ సిటిజన్ స్కూల్), ద్వితీయ బహుమతి సుశాంత్ (కేవీ స్కూల్) అందుకున్నారు. పీటీడబ్ల్యూఏ జిల్లా అధ్యక్షుడు కేఎస్.నందు, ప్రతినిధి కన్నూరి లక్ష్మణ్‌రావు ఉన్నారు.

కంటివెలుగును వినియోగించుకోండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం మూలసాలలో బుధవారం కంటివెలుగు వైద్యశిబిరాన్ని సర్పంచ్ ఎనగందుల శంకరయ్య ప్రారంభించారు. అందరికీ కంటిచూపు బాగుండాలనే ఆలోచనతో ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉదయ, భవాని, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ప్రవంతి, మల్లయ్య, అరుణ, బక్కయ్య తదితరులు ఉన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

ఓదెల: మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్ ఏరియా ఒడ్డెరకాలనీలో మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ మహిళలు ఖాళీ బిందెలతో బుధవారం రోడ్డుపై బైటాయించి ఆందోలన చేశారు. మిషన్ భగీరథ పైపులైన్ల ద్వారా మంచినీరు ఇప్పటికీ అందడం లేదని, మంచినీటి కోసం తిప్పలు పడుతున్నామని కాలనీకి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ ద్వారా సరఫరా అయ్యే మంచినీరు కనీసం తగడానికి సరిపోవటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న ఓదెల ఎంపీడీవో జి.సత్తయ్య, సర్పంచ్ సామ మణెమ్మ, ఢిల్లీ శంకర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రామపంచాయతీ నీటి సరఫరా కోసం కంట్రిబ్యూషన్ చెల్లిస్తే పైపులైన్ ద్వారా సరిపోయేంత నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వటంతో మహిళలు ఆందోళన విరమించారు.

సంక్షిప్త వార్తలు

✦ట్రాక్టర్ డ్రైవర్ల సమ్మెకు సంపూర్ణ మద్దతు

జ్యోతినగర్: రామగుండం పారిశ్రామిక ప్రాంతమైన ఎన్టీపీసీ పరిధిలో ట్రాక్టర్ డ్రైవర్లుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని చేపట్టిన సమ్మెకు ఐఎఫ్‌టీయూ (ప్రజాపంథా) సంపూర్ణ మద్దతు ఇస్తుందని రాష్ట్ర నాయకులు గుజ్జుల సత్యనారాయణరెడ్డి, తోకల రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్కెట్ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వేతనాలు పెంచాలని కోరారు.

✦బాయమ్మపల్లిలో బీరప్ప ఉత్సవాలు

ఓదెల: మండలంలోని బాయమ్మపల్లెలో జరిగిన బీరప్ప ఉత్సవాల్లో పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు పాల్గొన్నారు. బీరప్ప కామరాతి కల్యాణోత్సవం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పడాల రాజు, నాయకులు రెడ్డి రజనీకాంత్ పాల్గొన్నారు.

✦ధూళికట్టలో 165మందికి కంటి పరీక్షలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్టలో నిర్వహిస్తున్న కంటి వెలుగులో బుధవారం 165మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15మందికి కంటి అద్దాలు అందజేశారు. సర్పంచ్ గొల్లె కావేరి, ఎంపీటీసీ ఇరుగురాల సావిత్రమ్మ, మెడికల్ ఆఫీసర్ నిస్సీ క్రిస్టీనా, మెడికల్ క్యాంపు ఆఫీసర్ స్వప్న పాల్గొన్నారు.

✦గ్రామాల్లో పారిశుధ్య పనులు ప్రారంభం

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులను బుధవారం ప్రారంభించారు. ఎంపీవో కిరణ్, సర్పంచులు నర్సింహయాదవ్, సంతోశ్‌రావు, ఎల్లయ్య, భారతి, తొంటి దృ, ఈర్ల మల్లేశం, వీరయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

✦ఈజీఎస్ ఏపీవోగా బాధ్యతలు స్వీకరణ

ఓదెల: మండలంలని ఉపాధిహామీ పథకం ఏపీవోగా రమేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన కొమురయ్యను నిధుల దుర్వినియోగం అభియోగంపై ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యమెందుకు?


తేమశాతాన్ని పరిశీలిస్తున్న విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో పోసి నెల గడిచినా ఎందుకు తూకం వేయడం లేదని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ప్రశ్నించారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన అప్పన్నపేట సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చింతపండు సంపత్‌తో కలిసి పరిశీలించారు. తూకం కాగానే ట్రక్‌షీట్ రశీదు ఇవ్వాలన్నారు. మంత్రి, కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్యేలు చెప్తున్న మాటలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడడంలేదని ఆరోపించారు. నాయకులు మల్లయ్య, సంతోష్, సంపత్, శ్రీమాన్, తిరుపతిరావు, రవి, శ్రీనివాస్, శ్రీధర్, సమ్మయ్య, ఐలయ్య ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంటలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేయడంతో పాటు ఈ–పంచాయతీ భవనం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతులైన సీసీరోడ్లు, డ్రైనేజీలు, లింకురోడ్లు, బీటీరోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ బాలాజీరావు, సర్పంచ్ రవీందర్, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, రైతు సమితి మండల కోఆర్డినేటర్ రాజమల్లయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

అలవెన్స్‌లపై ఇన్‌కమ్‌టాక్స్ తిరిగి చెల్లించాలి


మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్న అలవెన్స్‌లపై ఇన్‌కమ్‌ట్యాక్స్ తిరిగి చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి డిమాండ్ చేశారు. జీడీకే–2వ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో బుధవారం మాట్లాడారు. ఈ సందర్భంగా యూనియన్ 16వ మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ 16 మీటర్ల ఎర్రజెండా ప్రదర్శన నిర్వహించారు.

21, 22వ తేదీల్లో మహాసభలు

రానున్న కాలంలో పోరాటాల రూపకల్పన కోసం, గోదావరిఖని కేంద్రంగా సీఐటీయూ రాష్ట్ర 16వ మహాసభలను 21, 22వ తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక మెయిన్‌చౌరస్తా శ్రామికభవన్ ముందు సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మేదరి సారయ్య, మెండె శ్రీనివాస్, కారం సత్తయ్య, ఆసరి మహేశ్, వంగల రాములు, పి.శ్రీనివాసరావు, గౌస్, ఆరెపల్లి రాజమౌళి, బొంకూరి సురేశ్, వంగల శివరామిరెడ్డి, కృష్ణ, ఈశ్వర్, గట్టయ్య పాల్గొన్నారు.

ముగిసిన రేణుక ఎల్లమ్మ పట్నాలు


మొక్కులు చెల్లిస్తున్న మంత్రి సతీమణి స్నేహలత

ధర్మారం: మండలంలోని దొంగుతుర్తి గ్రామంలో నాలుగురోజుల పాటు జరిగిన రేణుక ఎల్లమ్మ పట్నాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఎల్లమ్మ పట్నాల్లో భాగంగా చివరిరోజు కల్లుతో నైవేద్యం కోసం గౌడ యువకులు చెట్టుపైకి ఎక్కి కల్లు దించారు. ఉత్సవాలకు మంత్రి కొప్పుల ఈశ్వర్ సతీమణి, కొప్పుల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొప్పుల స్నేహలత, ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ పూజల్లో పాల్గొన్నారు. సహకార సంఘాల ఫోరం జిల్లా చైర్మన్ బలరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, వైస్ చైర్మన్ చొప్పరి చంద్రయ్య, ఇన్‌చార్జి సర్పంచ్ ముత్యాల చంద్రశేఖర్, ఎంపీటీసీ దాడి సదయ్య, నాయకులు బాలసాని లింగయ్య, పార్టీ నాయకుడు తిరుపతి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు వేతన ఒప్పందం అమలు చేయాలి


మాట్లాడుతున్న ఆకుల వెంకన్న

కమాన్‌పూర్: సింగరేణి సంస్థలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఏడో వేతన ఒప్పందం అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న కోరారు. ఆర్జీ–3 పరిధిలో కాంట్రాక్టు కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 కోల్‌కతాలో జరగబోయే 11వ వేతన ఒప్పంద చర్చలో కాంట్రాక్టు కార్మికుల వేతన ఒప్పందం అమలు చేసే విధంగా ఆ కార్మిక సంఘాలు ఒత్తిడి తీసుకొచ్చి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు. మనోజ్, రాములు, రాజనర్సు, రమేశ్, నర్సయ్య, మోహన్, లక్ష్మి, రాధ, రాజేశ్వరి, రజిత, కనకలక్ష్మి ఉన్నారు.

సీనియర్ సిటిజన్లు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు


పోర్టల్ సేవలు ప్రారంభిస్తున్న ఆర్డీవో

మంథని: నిరాదరణకు గురైన తల్లిదండ్రులు తమ సంరక్షణ చూసుకోని పిల్లలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చని, ఇందు కోసం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్‌ను ప్రారంభించినట్లు ఆర్డీవో వీరబ్రహ్మాచారి తెలిపారు. సీనియర్ సిటిజన్ కేసుల మానిటరింగ్‌కు ఆన్‌లైన్ పోర్టల్‌ను బుధవారం ప్రారంభించారు. జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్, రెవెన్యూ డివిజనల్ కార్యాలయ డీఏవో టి.రవీందర్ తదితరులు ఉన్నారు.

'విగ్రహావిష్కరణ పేరుతో విమర్శలు సరికాదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: బీపీ మండల్ విగ్రహావిష్కరణ చేసిన నాయకులు ఆయన గొప్పతనం, సేవల గురించి మాట్లాడకుండా ఎమ్మెల్యే శ్రీధర్‌బాబును విమర్శించడం సరికాదని మంథని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో అనేక అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించారు. అందుకే దుద్దిళ్ల కుటుంబానికి 40 ఏళ్లుగా ఆదరణ లభిస్తోందన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, మంథని మాజీ సర్పంచ్ ఒడ్నాల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అజీం ఖాన్, నాయకులు సత్యం, సతీశ్ ఉన్నారు.

సెమ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

జ్యోతినగర్: దేశవ్యాప్తంగా జరిగిన సెమ్స్ ఒలింపియాడ్ పరీక్షల్లో విశ్వభారతి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. వివిధ క్లాసుల విద్యార్థులు నేషనల్, స్టేట్స్ ర్యాంకులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఫలితాలను సెమ్స్ ఒలింపియాడ్ కన్వీనర్ ఎస్ఎన్ రెడ్డి, ఏఆర్‌సి రెడ్డి మంగళవారం హైదరాబాదులో విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి చేతులమీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు జాతీయస్థాయిలో పరీక్ష ఫలితాల్లో విశ్వభారతి, నవోదయ, సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు అనేక ర్యాంకులు సాధించి రామగుండం పారిశ్రామిక ప్రాంత ఘనతను చాటారు. జాతీయస్థాయిలో ఫస్ట్‌ర్యాంక్ సాధించిన విష్ణువర్ధన్‌తో పాటు నిషిత, వర్షిని, సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌కు చెందిన ముస్తఫా, నవోదయ స్కూల్‌కు చెందిన మేఘన, శ్రీహర్షిత, అక్షయ, వినేష్, ఆరాధ్య, లాస్య ప్రతిభ కనబరిచారు. విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరిగౌడ్, హెడ్‌మాస్టర్ తిరుపతిగౌడ్, నోయెల్ జోసెఫ్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ విద్యార్థులను అభినందించారు.

సొంత ఎజెండా కోసమే విగ్రహావిష్కరణ

మంథని: బీపీ మండల్ ఆశయాల దిశగా ముందుకు సాగుతున్నట్లు ప్రకటించుకున్న నాయకులు సభకు తనను ఎందుకు ఆహ్వానించలేదని రామగిరి ఎంపీపీ ఆరెల్లి దేవక్క కొమురయ్య ప్రశ్నించారు. మంథని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. కేవలం సొంత ఎజెండా అమలు కోసమే విగ్రహావిష్కరణ అని విమర్శించారు.